సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



విభిన్నమైన సెట్టింగ్‌లతో..
చౌటుప్పల్ పట్టణంలోని గాంధీపార్కులో 49 సంవత్సరాలుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.
- 8లో



కోతులతో బెంబేలు
అడ్డగూడూరు మండలంలో కోతుల సంచారం అధికమైంది. జనాలపై దాడికి పాల్పడుతున్నాయి.
- 9లో



రెగ్యులరైజ్ చేయాలి
మహాత్మాగాంధీ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.
- 10లో

న్యూస్‌రీల్

డీపీఓకు సమ్మె నోటీసు అందజేత

భువనగిరి టౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2నుంచి సమ్మె బాట పట్టనున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం నాయకులు వెల్లడించారు. శనివారం డీపీఓ సునందనకు సమ్మె నోటీసు అందజేశారు. గతంలో 34 రోజుల పాటు సమ్మె చేశామని, సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు చెప్పారు. కానీ, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని, అందుకే మళ్లీ సమ్మె చేయాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బందెల భిక్షం, కొల్లూరు ఆంజనేయులు, గోసంగి పరమేష్, యాదగిరి, ఆడపు స్వామి, పాపయ్య, కృపాకర్ బాపు, సాయిలు, లక్ష్మీ, జహంగీర్, మల్లమ్మ, పద్మ, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందజేయాలి



మాట్లాడుతున్న శ్రవణ్‌రెడ్డి

భువనగిరి : రోగులకు వ్యాధుల నిర్ధారణ సమయంలో నైపుణ్యత ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్‌సీడీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రవణ్‌రెడ్డి అన్నారు. శనివారం భువనగిరిలోని ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్డ్ భవనంలో ఎన్‌సీడీ(అసంక్రమిత వ్యాధుల)పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సరైన కొలమానాలు పాటిస్తూ వ్యాధికి అనుగుణంగా పూర్తిస్థాయిలో చికిత్స అందజేయాలని సూచించారు డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ శిక్షణ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకొని క్షేత్ర స్థాయిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కోరారు. 30 సంవత్సరాల వయస్సు పైబడిన వారు జనాభాలో 37 శాతం ఉన్నారని, వారికి ఎన్‌సీడీ పరీక్షలు చేయాలన్నారు. బీపీ, డయాబెటిక్, కేన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుమన్‌కళ్యాణ్, డాక్టర్ యశోద, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల్లో వెనకడుగు



మాట్లాడుతున్న నిమ్మయ్య

భువనగిరి : విద్య సామర్థ్యాల విషయంలో జిల్లా వెనుకబడి ఉందని ప్రజా సంఘాల నాయకుడు నిమ్మయ్య అన్నారు. శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భువనగిరిలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల విషయంలో దేశంలోని 748 జిల్లాల్లో యాదాద్రి 697వ స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శివరాజు, జె.భాస్కర్, వీవీ రావు, మల్లేశం, వినోద్ కుమార్, రాంబాయి, సరోజని పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అభిషేకం, అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోనాలతో నిరసన



కలెక్టరేట్ ఎదుట బోనాలు ఎత్తుకొని నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

భువనగిరిటౌన్ : పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం కలెక్టరేట్ ఎదుట బోనాలతో నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు భోజనం అందించడానికి వంట ఏజెన్సీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అప్పు తెచ్చి వడ్డించవలసిని దుస్థితి ఏర్పడిదన్నారు. అదే విధంగా పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ఉపాధ్యక్షులు జిన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, సంఘం నాయకులు నిర్మల, సంధ్య, లక్ష్మి, మమత, స్వప్న, శ్యామ్, అనసూర్య, వాణి, కృష్ణవేణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌తో 25న ఫోన్ ఇన్

భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య సమస్యపై సోమవారం 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహించనుంది. మురుగు కాల్వల నిర్మాణం, ఓపెన్ డ్రెయినేలు, చెత్త పేరుకుపోవడం, ఓపెన్ ప్లాట్లలో మురుగునీరు నిల్వ ఉండడం తదితర సమస్యలపై మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మీ ప్రశ్నలకు కమిషనర్ సమాధానం ఇస్తారు.

తేది. 25.09.2023 సోమవారం
మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు

డయల్ చేయాల్సిన నంబర్ : **9394749205**



కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

నిరుద్యోగుల్లో నిరాశ!

గ్రూప్–1 ప్రిలిమ్స్ మళ్లీ రద్దు
- ఏడాదిన్నర కాలంగా ప్రిపరేషన్
- ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో కోచింగ్
- సమయం, డబ్బు వృథా అవుతుందని అభ్యర్థుల ఆవేదన
- పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శలు

సాక్షి, యాదాద్రి : గ్రూప్–1 ప్రిలిమ్స్ మళ్లీ రద్దయ్యింది. మొదటిసారి ప్రశ్నపత్రం లీకేజీ, రెండవ సారి అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోలేదని, తప్పుడు ఓఎంఆర్‌షీట్ కారణంగా రద్దు చేస్తూ శనివారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉద్యోగార్థుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ శిక్షణ సంస్థలు, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయల ఫీజు చెల్లించి, పట్టణాల్లో గదులు అద్దెకు తీసుకుని గ్రూప్–1కు సన్నద్ధమవుతున్నామని, ఏడాదిన్నర కాలంగా పడ్డ శ్రమంతా వృథా అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3,644 దరఖాస్తులు.. 2022 ఏప్రిల్‌లో టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్ 16న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. కానీ, పేపర్ లీకేజీ కారణంగా అక్టోబర్ 16, 2022న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్ష మార్చి 2023లో రద్దు చేస్తున్నట్లు టీఎస్పీఎస్సీ ప్రకటించిది. అభ్యర్థులు మరోసారి దరఖాస్తు చేసుకునే అవసరం లేకుండా.. గతంలో అప్లయ్ చేసుకున్న వారందరికీ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించింది. ఈ మేరకు ఈ ఏడాది జూన్ 11న రెండో సారి ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. పలు కారణాలతో అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో పరీక్షను రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో 3,644 మంది దరఖాస్తు చేసుకున్నారు.



గ్రూప్–1 మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

ఇద్దరం ఎంతో శ్రమించాం

తండ్రీకొడుకులం రెండుసార్లు గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రాశాం. ఇందుకోసం రాత్రి, పగలు చాలా కష్టపడ్డాం. పరీక్ష రద్దు కావడంతో నా కుమారుడు మానసికంగా కృంగిపోతున్నాడు. నాకు కూడా ఇది చివరి నోటిఫికేషన్. కేవలం బయోమెట్రిక్ కాలేదని పరీక్షను రద్దు చేయడం దారుణం. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు.



ప్రిలిమ్స్ పరీక్ష రెండుసార్లు రాసిన తండ్రీకొడుకు బాల్‌నర్సయ్య, సచిన్, రామాజీపేట, గుట్ట

నిరాశకు లోనయ్యా



రెండవ సారి కూడా గ్రూప్–1ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావడంతో నిరాశకు లోనయ్యాను. ఉద్యోగం కోసం కొన్నేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ కోచింగ్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్నా. పరీక్షలు నిర్వహించే ముందు ఎలాంటి చిక్కులు రాకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. పరీక్ష రాయడానికి మళ్లీ సమయం కేటాయించాల్సి ఉంటుంది.

– పాశం శివానంద్, భువనగిరి

నిరుద్యోగుల జీవితాలతో ఆటలొద్దు



రెండు సంవత్సరాలుగా గ్రూప్–1కోసం ప్రిపరేషన్ అవుతున్నా. రెండు సార్లు ప్రిలిమ్స్ రద్దు చేశారు. డబ్బు, సమయం వృథా అయ్యింది. కోచింగ్‌తోపాటు అన్ని రకాల ఖర్చులకు రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేశాను. మళ్లీ సమయం, డబ్బు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రభుత్వం గ్రూప్ –1అభ్యర్థులకు పరిహారం చెల్లించాలి. ప్రిపరేషన్ కోసం సౌకర్యాలు కల్పించాలి.

– కె.లింగస్వామి, జనగాం, నారాయణపురం

సమయం వృథా అయింది



గ్రూప్–1 ప్రిల్సిమ్స్ మళ్లీ రద్దు కావడంతో సమయం, డబ్బు వృథా అయ్యింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏడాదిన్నర కాలంగా శ్రమిస్తున్నా. డబ్బు కూడా ఖర్చయ్యింది. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ కోచింగ్ తీసుకొని ప్రిపరేషన్ అయ్యాను. రెండవసారి పరీక్ష రద్దు చేయడంతో మనోవేదానికి గురవుతున్నా. నిరుద్యోగుల జీవితాలో ఆటలు ఆడవద్దు.

– దేవనబోయిన నరేష్, గుండాల

ముందుగానే ఊహించా..



పరీక్షలను ప్రభుత్వ పకడ్బందీగా నిర్వహించడం లేదు. ఓఎంఆర్ షీట్‌పై అభ్యర్థుల వివరాలు లేవు. బయోమెట్రిక్, తంబ్ తీసుకోలేదు. దీంతో రెండవసారి నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షను కూడా కోర్టు రద్దు చేస్తుందని ముందుగానే ఊహించాం. ఒకే పరీక్షను రెండు, మూడు సార్లు రాయవలిసిన పరిస్థితి రావడం ఆందోళనకు గురి చేస్తోంది.

– జంగవెల్లి రాజశేఖర్, మోటకొండూరు

ప్రభుత్వ వైఫల్యం వల్లే..

గ్రూపు–1 ప్రిలిమ్స్ పరీక్ష రెండవ సారి కూడా రద్దవడంతో ప్రభుత్వ వైఫల్యం బయటపడింది. ఆర్థికంగా ఇబ్బందులున్నా కోచింగ్ తీసుకొని ప్రిపరేషన్ అయ్యాను. పరీక్షను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులు మనోవేదనకు గురవుతున్నారు. తల్లిదండ్రులకు నిరాశను మిగిల్చింది. టీఎస్పీఎస్సీ అనాలోచిత నిర్ణయాలతో నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా పోతున్నాయి. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి.

–సీహెచ్ నాగయ్య, భువనగిరి

ప్రగతి నివేదిక తయారు చేయండి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రగతి నివేదిక తయారు చేసి అందజేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. 2014 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై నివేదికలు తయారు చేసి నిర్దేశిత ఫామ్‌లో నమోదు చేసి సమర్పించాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్‌లు, స్త్రీనిధి, పల్లె ప్రగతి, కల్యాణలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గొర్రెల పంపిణీ తదితర పథకాలకు సంబంధించి నివేదికలు అందజేయాలన్నారు. పొరపాట్లకు తావుండరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్యానాయక్, వ్యవసాయ, విద్యాశాఖ, వెనుకబడిన తరగతులు, పంచాయతీరాజ్, నీటి పారుదల, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో కులవృత్తులకు జీవం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



ఆలేరులో మోడల్ ధోబీ ఘాట్‌కు శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత

ఆలేరురూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం కులవృత్తులకు ఆర్థికంగా చేయూనిస్తూ జీవం పోస్తుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పేర్కొన్నారు. రూ.25కోట్ల వ్యయంతో ఆలేరులో నిర్మించిన మోడల్ ధోబీ ఘాట్‌కు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ పాలన కొనసాగుతుందన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలో అన్ని కులాల సంక్షేమానికి నిధులివ్వడంతో పాటు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. అనంతరం ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, వైస్ చైర్మన్ మొరిగాడి మాధవీవెంకటేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతిప్రవీణ్, కౌన్సిలర్లు బేతిరాములు, జూకంటి సంపత్, నర్సింహులు, పుట్ట మల్లేషం, పత్తి వెంకటేష్, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, బాలస్వామి, కుండె సంతప్, జెల్లి నర్సింహులు, మురళి, పూల శ్రవణ్, బీఆర్‌ఎస్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆలేరురూరల్ : ఎన్నికల సిబ్బంది ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి సూచించారు. శనివారం ఆలేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సెక్టోరియల్, నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల విధులపై వివరించారు. పశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ శివరాంరెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోటకొండూరు తహసీల్దార్‌కు అస్వస్థత
ఇదిలా ఉండగా సమావేశం నిర్వహిస్తుండగా మధ్యలో మోటకొండూర్ తహసీల్దార్ శాంతిలాల్ నాయక్ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో అస్పత్రికి తరలించారు.

నేడు మొహర్రం వీడ్కోలు ధార్మిక సభ

భువనగిరిటౌన్ : భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో మొహర్రం వీడ్కోలు ధార్మికసభ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ రజా హుసేన్, సయ్యద్ కల్బే హుసేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాజీ మోహిల్లాలోని షియా మసీదులో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం వరకు సభ ఉంటుందన్నారు. సభకు ముఖ్య అతిథిగా మత గురువు శంస్ అబ్బాస్ నఖ్వీ హాజరై ధార్మిక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ల వాడకం వల్ల అనర్థాలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి మారుతిదేవి

- జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి

భువనగిరి : సెల్‌ఫోన్‌లు అధికంగా వినియోగించడం వల్ల అనర్థాలు తలెత్తుతాయని జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి అన్నారు. శనివారం భువనగిరి మండలం అనంతారం మహాత్మా జ్యోతిభా పూలే పాఠశాలలో జిల్లా వైద్యారోగ్య శాఖ, పాఠశాల సంయుక్తంగా నిర్వహించిన ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్లు ఎక్కువగా వినియోగించడం వల్ల కంటితో పాటు వినికిడి సమస్యలు ఏర్పడుతాయన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యశోద, డాక్టర్ రాజశేఖర్, షరీఫ్, మురళీ, వాసంతి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

భువనగిరిటౌన్ : చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి అన్నారు. శనివారం భువనగిరిలోని మున్సిపల్ కార్యాలయంలో చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భార్యాభర్తలు వైవాహిక జీవితంలో బాధ్యతాయుతంగా మెలగాలని, ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ పోషణలో పరస్పరం అవగాహనతో ముందుకెళ్లాలని సూచించారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ వ్యవస్థల ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశవర్కర్స్ పాల్గొన్నారు.

హస్తినకు ఆశావహులు

కాంగ్రెస్ నేతల ఢిల్లీ బాట..
- టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు
- ఏఐసీసీ పెద్దలను కలుస్తున్న నాయకులు
- నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు చొప్పున హస్తినలో మకాం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆశావహులంతా ఢిల్లీ బాట పట్టారు. ఇప్పటికే చాలా మంది ఢిల్లీలో మకాం వేయగా, మరికొంత మంది హస్తినకు పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లను ఖరారు చేసేందుకు స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది. దీంతో తమ బెర్త్‌ను దక్కించుకునే ప్రయత్నాల్లో ఆశావహులు నిమగ్నమయ్యారు. తమ బయోడేటాలు, తాము చేసిన కార్యక్రమాల ఫైళ్లను పట్టుకొని ఏఐసీసీ నేతల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఢిల్లీలో మకాం వేశారు. టికెట్ కోసం సంఖ్యాపరంగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నా ఢిల్లీకి వెళ్లిన వారిలో ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఉన్నారు. ఒకటీ రెండు నియోజకవర్గాలకు చెందిన వారు మినహా, మిగితా అన్ని నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు ఢిల్లీలోనే ఉన్నారు. ఢిల్లీకి వెళ్లిన నేతలంతా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులను కలుస్తున్నారు. రాష్ట్రానికి చెందిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీలు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాస్కీగౌడ్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీ మన్సూర్ అలీ, తెలంగాణ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ విష్ణునాథన్ తదితర నేతలను కలుస్తున్నారు.

ఢిల్లీలో వీరే..
మునుగోడు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత ఇప్పటికే ఢిల్లీలో మకాం వేయగా, చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి త్వరలోనే ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి నుంచి జిట్టా బాలకృష్ణారెడ్డి కూడా త్వరలోనే ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, తుంగతుర్తి నుంచి అద్దంకి దయాకర్, ప్రీతం, సూర్యాపేట నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మిర్యాలగూడ నుంచి రఘువీర్‌రెడ్డి, దేవరకొండ నుంచి రవినాయక్, భువనగిరి నుంచి శివరాజ్‌గౌడ్ తదితర నేతలు ప్రస్తుతం ఢిల్లీలోనే ఉండి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం టికెట్ ఎవరికి ఖరారు చేస్తుందన్నది అక్టోబరు మొదటి వారంలో తేలనుంది.

వీరేశం పోటీ స్థానంపై చర్చ
కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న వేముల వీరేశంను కాంగ్రెస్ పార్టీ ఎక్కడి నుంచి పోటీలో దింపుతుందన్న దానిపైనే చర్చ సాగుతోంది. నకిరేకల్ నుంచి కాకుండా, తుంగతుర్తి నుంచి పోటీలో దింపాలన్న చర్చను పార్టీలో కొందరు నేతలు తీసుకువచ్చారు. తానను నకిరేకల్ నుంచి మాత్రమే పోటీ చేస్తానని, అక్కడ టికెట్ ఇస్తేనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని వీరేశం గతంలోనే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, మరో నియోజకవర్గం నుంచి చేయబోనని పేర్కొన్నారు. నకిరేకల్ టికెట్ ఇచ్చేందుకు ఓకే చెప్పడంతోనే శుక్రవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు.

వీరేశం చేరిక.. మరికొంత ఆలస్యం

నకిరేకల్: మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరిక రెండు మూడు రోజులు ఆలస్యం కానుంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడం.. వీరేశం చేరిక ఆలస్యానికి కారణమని తెలిసింది. అప్పటి వరకు వీరేశం ఢిల్లీలో ఉండనున్నారు. శనివారం ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో కలిశారు. వీరేశంతో ఢిల్లీకి వెళ్లిన ఆయన అనుచరుల రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెంకన్న, నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, కట్టంగూరు మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత ఎంపీటీసీ మాద యాదగిరి, తాటికల్, గోరెంకలపల్లి ఎంపీటీసీ సభ్యులు గాదగోని శ్రీలత కొండయ్య, దాసరి వీరార్జున్‌రెడ్డి, మర్రూర్, నెమ్మాని మాజీ సర్పంచ్‌లు నకిరేకంటి నరేందర్, సిద్దగోని స్వామి, ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, కేతేపల్లి, చిట్యాల మాజీ ఎంపీపీలు గుత్తా మంజుల మాదవరెడ్డి, బట్టు అరుణఅయిలేష్, సీనియర్ నాయకులు గంగుల రాజిరెడ్డి, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య, గడ్డం పశుపతి, సట్టు సత్తయ్యతో పాటు మరో 50 మందికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పారు. అయితే వేముల వీరేశంకు ఇచ్చే స్థానం విషయంలోనే మరింత స్పష్టత కోసమే ఆగినట్లుగా తెలుస్తోంది.



ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని కలిసిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వీరేశం

క్లుప్తంగా

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

రామగిరి(నల్లగొండ): పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని వ్యక్తిపై దాడి జరిగిన ఘటన తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. తిప్పర్తి పంచాయతీ పరిధిలోని నూకలవారిగూడేనికి చెందిన నూకల వెంకన్న, నూకల మహేష్ అన్నదమ్ముల పిల్లలు. వీరిద్దరికీ భూ వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వెంకన్న శుక్రవారం అర్ధరాత్రి మహేష్ ఇంటి ముందు నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మహేష్ కర్రతో వెంకన్నపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో వెంకన్న తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. వెంకన్న తల్లి అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

శాలిగౌరారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల యాదగిరి–ఆగ్నేషా దంపతులకు ఇద్దరు కూతుళ్లతో పాటు కుమారుడు సందీప్(28) ఉన్నాడు. సందీప్ ఈనెల 12న రాత్రి వ్యక్తిగత పనిపై బైక్‌పై నకిరేకల్‌కు వెళ్తున్న క్రమంలో పెర్కకొండారం–కడపర్తి శివారులో రోడ్డుపై అడ్డంగా పెట్టిన ప్రొక్లెయిన్‌ను వెనుకనుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది.

ఒకే మాట.. ఒక్కటే విగ్రహం

- కేశవాపురంలో ఏకదంతుడి విగ్రహం ఏర్పాటు
- కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా పూజలు
- నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ


వినాయక మండపం వద్ద భజన చేస్తున్న గ్రామస్తులు

మాడుగులపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు వస్తే వాడవాడలో సందడే. మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి వీధికో విగ్రహం పెట్టి నిర్వాహకులు చేసే హడావిడి మామూలుగా ఉండదు. డీజే పాటలు, నృత్యాలు, ఇతర వినోద కార్యక్రమాలతో తారాస్థాయి హంగామా ఉంటుంది. ఖర్చుకు వెనుకాడకుండా దర్పం ప్రదర్శించేందుకు ఒకరికొకరు పోటీ పడుతుంటారు. ఇలాంటి పరిస్థితులున్న ప్రస్తుతం తరుణంలోనూ మాడుగులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామస్తులు ఇందుకు పూర్తి భిన్నంగా చవితి వేడుకలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రత్యేకత ఇదే..

కేశవాపురం (పెద్దపాడు) గతంలో ఉమ్మడి కన్నెకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామం. ఏడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం 500లోపు జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా గుర్తించడంతో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. 1981 నుంచి గ్రామస్తులు ఇక్కడ చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం పెద్దలు నిర్ణయించిన విధంగానే ఇప్పటికీ ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఈ విగ్రహం వద్దే పూజలు నిర్వహిస్తారు. మండపం వద్ద డీజేలు, నృత్యాలు కాకుండా భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు. 2002 వరకు ఇంటింటికీ చందాలు పోగేసి వేడుకలు నిర్వహించారు. ఆ తరువాత నుంచి లడ్డూ వేలంపాట ద్వారా వచ్చిన మొత్తాన్నే మరుసటి ఏడాది వేడుకల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

ఆనవాయితీ కొనసాగిస్తున్నాం



గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలన్న ఉద్దేశంతో 40 ఏళ్ల క్రితం పెద్దలు గ్రామంలో ఒకే వినాయక విగ్రహం పెట్టాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీనే కొనసాగిస్తున్నాం. కులమతాలు, రాజకీయాలకుఅతీతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గ్రామస్తుల ఐక్యత కారణంగానే నాలుగు దశాబ్దాలుగా విజయవంతంగా వేడుకలు జరుగుతున్నాయి.

– గనిపెల్లి మోహన్, కేశవాపురం గ్రామస్తుడు

నిరాడంబరంగా వేడుకలు చేస్తాం



గ్రామంలో వినాయక చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తాం. డీజేలు, మైకులు, ఇతరాత్ర వినోద కార్యక్రమాలకు తావులేకుండా భజనలు, కోలాటాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఉత్సవ కమిటీ నిర్ణయం మేరకు అందరం నడుచుకుంటాం. ఒకరినొకరం గౌరవించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతాం. భక్తులకు అన్నదానం చేసేందుకు మాత్రమే దాతల సహకారం కోరతాం.

– నెర్మటి వెంకట్‌రెడ్డి, కేశవాపురం సర్పంచ్

మార్కండేయ దేవాలయంలో 45 ఏళ్లుగా..

- గణేశ్ నవరాత్రి వేడుకలు

రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ దేవాలయంలో 45 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో వినాయక విగ్రహ ఏర్పాటును అప్పటి పద్మశాలీ కులస్తులు 1979లో దాత రవ్వ నర్సింహులు ద్వారా ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటివరకు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా శ్రీ గణనాధుడిని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఆనాడు దాతల సహాయంతో విరాళాలు సేకరించి అందులో ఖర్చుపోను మిగిలిన డబ్బులు రొటేషన్ పద్ధతి ద్వారా కొనసాగించారు.

ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకుంటాం



పద్మశాలీ కులస్తులమంతా కలిసి వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసుకుంటాం. వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ, ఫలం ద్వారా వచ్చిన డబ్బులతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

– ఆడెపు శ్రీశైలం, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజాపేట


రాజాపేటలో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున భక్తులు

విభిన్నమైన మండపం సెట్టింగులతో..

- చౌటుప్పల్‌లోని గాంధీ పార్కు ఆవరణలో 1975 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- మొదటి పదేళ్లు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో..
- 1985 నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు


చౌటుప్పల్‌లోని గాంధీపార్కులో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం సెట్టింగ్

చౌటుప్పల్: పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీపార్కులో గత 49 ఏళ్లుగా వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1975లో ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో ఆదర్శ యూత్ పేరిట వేడుకలు జరిగేవి. దివంగత మాజీ సర్పంచ్ గోశిక వెంకటేశం ఇక్కడ మండపాన్ని ఏర్పాటు చేసి చవితి వేడుకలకు అంకురార్పన చేశారు. పదేళ్ల పాటు అదే యూత్‌త్ ఆధ్వర్యంలో, అతడి సారధ్యంలోనే ఉత్సవాలు జరిగాయి. ఆ తర్వాత 1985 సంవత్సరం నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది విభిన్నమైన సెట్టింగ్‌లతో మండపం ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నెలకొల్పే వినాయక విగ్రహాలు అప్పట్లో ఈ ప్రాంతంలోనే అత్యంత ఎత్తైనవిగా గుర్తింపు పొందాయి. 1996లో 16 ఫీట్ల విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. విగ్రహాన్ని తీసుకువస్తున్న డీసీఎం పలు ప్రాంతాల్లోని రైల్వే బ్రిడ్జిల కింద నుంచి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి నిర్వాహకులు విగ్రహం ఎత్తు తగ్గించి మండపాన్ని భారీ సెట్టింగ్‌లతో అలంకరించే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రత్యేక గుర్తింపు ఉంది



గాంధీ పార్కు ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలను గత 39ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. అంతకు ముందు పదేళ్ల పాటు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. మొదట్లో విగ్రహం ఎత్తుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వగా ప్రస్తుతం మండపం అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. చౌటుప్పల్ పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు అనగానే శివాజీ యూత్ అనే విధంగా ప్రత్యేక గుర్తింపు లభించింది.

– గుజ్జుల సురేందర్‌రెడ్డి, శివాజీ యూత్ అధ్యక్షుడు, చౌటుప్పల్

45 ఏళ్లుగా గణనాథుడి సేవలో..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని నేతాజీ యువజన సంఘం సభ్యులు 45 ఏళ్లుగా గణనాథుడి సేవలో తరిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోనే మొట్టమొదటి సారిగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా ప్రతిఏటా గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. మొదట్లో హైదరాబాద్‌లోని ధూళిపేటలో ఆర్డర్ ఇచ్చి వెయ్యి రూపాయలకు 5 అడుగుల వినాయక విగ్రహాన్ని తయారుచేయించి ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అప్పట్లో ఒక్కటే వినాయక విగ్రహం ఉండటంతో ఊరంతా ఇక్కడికి వచ్చి గణనాథుడిని దర్శించుకునేది. మూడు, లేదా ఐదు రాత్రులను పురస్కరించుకొని భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతేకాక దాతల సహకారంతో భక్తులకు మహాన్నదానం చేస్తున్నారు. కాగా పోచంపల్లి పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, పతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం విశేషం.


గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మొదటి విగ్రహం మాదే..



పోచంపల్లిలోనే మొదట నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. గతంలో ముంబాయి, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రతిష్ఠించేది. అయితే పోచంపల్లిలో కూడా గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నాడు సంఘం అధ్యక్షుడిగా ఉన్న గునిగంటి సుదర్శన్ నిర్ణయించారు. అప్పట్లో ఊరంతా ఇక్కడికి వచ్చి వినాయకుడిని పూజించేది. చాలా మంది ప్రముఖులు మా వినాయకుడిని దర్శించుకొని పూజలు చేశారు.

– సార బాలయ్యగౌడ్, నేతాజీ యువజన సంఘం గౌరవ సలహాదారుడు, భూదాన్‌పోచంపల్లి

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా Union Bank of India
చౌటుప్పల్ బ్రాంచ్-126851-వరంగల్ రీజియన్
ఫోన్: 08694-261777, ఈమెయిల్: ubin0812650@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం) - [రూల్ - 8(1)]

మెసర్స్ శివాని హోటల్ అండ్ లాడ్జ్, దీని ప్రొప్రైటర్ శ్రీ కోళ్ల శ్రీనివాస్ తండ్రి పుల్లయ్య, ఇ.నం.3-465 మరియు 3-466, మెయిన్ రోడ్డు, యాదాద్రి భువనగిరి, తెలంగాణ - 508252	1. తనఖాదారు: శ్రీ చింతల భిక్షపతి తండ్రి రాములు, ఇ.నం.2-2-72/24, తురబ్‌నగర్, అంబర్‌పేట, హైదరాబాద్ - 500013.
	2. తనఖాదారు: శ్రీ కోళ్ల శ్రీనివాస్ తండ్రి పుల్లయ్య, 1.ఇ.నం.3-465 మరియు 3-466, మెయిన్ రోడ్డు, యాదాద్రి భువనగిరి, తెలంగాణ - 508252

[illegible] 30.06.2023 [illegible] రూ.18,15,686.98 [illegible]

[illegible] 20.09.2023 [illegible]

స్థిరాస్తుల వివరణ - కొల్లేటరల్ సెక్యూరిటీ

[illegible]


తేది: 20.09.2023
ప్రదేశం: చౌటుప్పల్
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆలంపల్లి శేఖర్ (ఫైల్)

మాడుగులపల్లి: అప్పుల బాధ తాళలేక గడ్డి మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపురం గ్రామానికి చెందిన ఆలంపల్లి శేఖర్ (48)కు భార్య జానమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా తన కున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ స్థానికంగా ఓ భూస్వామి వద్ద జీతం చేస్తున్నాడు. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు, కుటుంబ అవసరాలకు సుమారు రూ.8 నుంచి 10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరగడం, మూడు నెలలుగా చేసేందుకు పనిసైతం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో శేఖర్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఈ నెల 21న (గురువారం) ఉదయం పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. స్థానికులు గుర్తించి అతడిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆలంపల్లి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి లేక యువకుడి బలవన్మరణం


రాజు(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం : ఉపాధి కరువవడంతో ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంస్థాన్ నారాయణపురం మండలం జనగామలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ గ్రామానికి చెందిన వరికుప్పల రాజు(23) కంప్రెషర్ వాహనాన్ని అద్దెకు తీసుకొచ్చి నడిపిస్తున్నాడు. వాహనానికి పనులు సరిగా దొరకకపోవడంతో ఆర్థి కంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన రాజు గ్రామంలో కూలీలకు అద్దెకు తీసుకున్న ఇంట్లోనే శనివారం స్లాబ్ కొక్కానికి లుంగీతో ఉరేసుకున్నాడు. ఇంటి ముందు నుంచి వెళ్తున్న వారు గమనించడంతో అప్పటికే రాజు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుడు తండ్రి కృష్ణయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

చిరుత పులి పిల్లలా.. అడవి పిల్లులా ?

- దామరచర్ల మండలం ఇర్కిగూడెంలో పాదముద్రల కలకలం


పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ, పోలీసు శాఖ అధికారులు


చిరుత పులి పిల్లదిగా గ్రామస్తులు అనుమానిస్తున్న పాదముద్ర

మిర్యాలగూడ: దామరచర్ల మండలం ఇర్కిగూడెంలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో చిరుత పులి పిల్లలవిగా భావిస్తున్న పాదముద్రలు కలకలం రేపాయి. స్థానికులు ఫారెస్ట్, పోలీసు శాఖల అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఇర్కిగూడెం అటవీ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకి–నార్కట్‌పల్లి రహదారి పక్కన కృష్ణా నది సమీపంలో రెండు చిరుతపులి పిల్లలు తిరుగుతున్నాయని కొందరు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు పరిసర ప్రాంతాలను గాలించారు. పాదముద్రలను పరిశీలించి ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అవి చిరుత పిల్లలు కావని అడవి పిల్లికి చెందిన పాదముద్రలుగా ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అటవీ సిబ్బందిని నిఘా ఉంచామని, అవి పులి పిల్లలా, అడవిపిల్లులా అనేది నిర్ధారణ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఆనంద్‌రెడ్డి, మిర్యాలగూడ సీఐ సత్యనారాయణ, వాడపల్లి ఎస్ఐ రవికుమార్, బీట్ ఆఫీసర్ ముఖేష్, మిర్యాలగూడ బీట్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, ఆజం పాల్గొన్నారు.

గణేశ్ శోభాయాత్రలో కత్తిపోట్లు

మిర్యాలగూడ అర్బన్: గణేశ్ శోభాయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. గంజాయి మత్తులో ఓ వ్యక్తి మిర్యాలగూడ డీసీఎం యూనియన్ జనరల్ సెక్రటరీ వెంకన్నపై కత్తితో దాడి చేశాడు. మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్‌లో నివాసముంటున్న సుంకరబోయిన వెంకన్న డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శనివారం నిర్వహిస్తున్న శోభాయాత్రలో పాల్గొన్నాడు. వాడపల్లిలో వినాయకుడిని నిమజ్జనం చేసే క్రమంలో పట్టణంలో నిర్వహిస్తున్న శోభాయాత్రలో మిర్యాలగూడ మండలం తుంగపాడుకు చెందిన నాగరాజు కూడా పాల్గొన్నాడు. నాగరాజు గంజాయి మత్తులో డీజేకు అనుగుణంగా నృత్యం చేస్తూ శోభాయాత్రను ముందుకు సాగనివ్వడం లేదు. దీంతో శోభాయాత్ర నిర్వాహకులు డీజేని ఆపి ముందుకు సాగుతున్నారు. దీంతో కోపోద్రిక్తుడైన నాగరాజు వెంట తెచ్చుకున్న కత్తితో వెంకన్నపై దాడి చేశాడు. గమనించిన కొందరు నాగరాజుని అడ్డుకుని గాయపడిన వెంకన్నను ఆస్పత్రికి తరలించారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్నను డీఎస్పీ వెంకటగిరి కలిసి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

హుజూర్‌నగర్ : బేకరీ దుకాణదారుడిపై చేయి చేసుకున్న వ్యక్తిపై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ఫేమస్ బేకరీలోకి శనివారం ప్రదీప్‌రెడ్డి ప్రవేశించాడు. దౌర్జన్యంగా చాక్లెట్ తీసుకున్నాడు. దుకాణదారుడు డబ్బులు అడగడంతో నన్నే డబ్బులు అడుగుతావా అంటూ దుర్భాషలాడి అతనిపై చేయి చేసుకుని వెళ్లిపోయా డు. ఇదంతా అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అనంతరం దుకాణం యజమాని జాసి ద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు దినసరి కూలీ మృతి

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల గ్రామంలో ప్రమాదవశాత్తు దినసరి కూలీ మృతిచెందాడు. తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన వీరయ్య (42) కాంట్రాక్టర్ కింద దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. పామనగుండ్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలకు నూతన వైర్లు లాగుతున్నారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు వచ్చే విద్యుత్ సరఫరా నిలిపివేసి కూలీలు పనులు చేస్తున్నారు. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో వీరయ్య వైరు లాగుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎల్‌సీ తీసుకుని వైర్లు లాగుతున్నప్పటికీ ఇన్వర్టర్ల ద్వారా విద్యుత్ ప్రసరణ జరగడంతో వీరయ్య మృతిచెంది ఉంటాడనని విద్యుత్ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : విద్యార్థిని అదృశ్యమైంది. అర్వపల్లి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రాజబోయిన పూజిత సూర్యాపేటలోని శ్రీనిధి కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈనెల 20న పూజిత కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరింది. బస్సు మిస్ కావడంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై నెమ్మికల్ వరకు వచ్చింది. అనంతరం అక్కడినుంచి పూజిత కనిపించకుండాపోయింది. సాయంత్రం పూజిత ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో పూజిత తల్లి జయమ్మ శనివారం ఆత్మకూర్(ఎస్) పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ రివర్స్ తీస్తుండగా ప్రమాదం

- వ్యక్తి పైనుంచి టైర్ వెళ్లడంతో మృతి
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో విషాదం


సంజీవరెడ్డి(ఫైల్)

చౌటుప్పల్ : ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి బలయ్యాడు. చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దండుమల్కాపురం గ్రామానికి చెందిన అత్తాపురం సంజీవరెడ్డి (65)కి ట్రాక్టర్ ఉంది. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో మట్టితోలేందుకు కిరాయికి వెళ్లాడు. పరిశ్రమలో ఎత్తుగా ఉన్న ప్రదేశంలో మట్టి అన్‌లోడ్ చేయాల్సి వచ్చింది. తనకు ట్రాక్టర్‌ను రివర్స్ తీయడం రాకపోవడంతో మరో ట్రాక్టర్ డ్రైవర్ సాయాన్ని కోరాడు. ఆ క్రమంలో వెనుక వైపు అత్తాపురం సంజీవరెడ్డి నిల్చున్న విషయాన్ని గమనించకుండా, నిర్లక్ష్యంగా సదరు డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనక్కి తీశాడు. దాంతో ట్రాక్టర్ వెనుక భాగంలోని ట్రాలీ టైరు ఒక్కసారిగా సంజీవరెడ్డి మీది నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.

టిప్పర్ ఢీకొని రైతు దుర్మరణం

- ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన


దేవరకొండలో రహదారిపై ఆందోళన చేస్తున్న పంతు బంధువులు

దేవరకొండ : టిప్పర్ ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం వద్యతండా గ్రామపంచాయతీ పరిధి కారోబార్‌తండాకు చెందిన నేనావత్ పంతు(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరిచేనుకు క్రిమిసంహారక మందు కొనేందుకు శని వారం దేవరకొండ పట్టణానికి బైక్‌పై వచ్చాడు. పట్టణంలోని బస్టాండు సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ వాహనం బలంగా పంతు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిన పంతుమీద నుంచి టిప్పర్ వాహనం వెళ్లడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన

పంతు మృతి విషయం తెలుసుకున్న అతడి బంధువులు, తండావాసులు పెద్ద ఎత్తున దేవరకొండకు చేరుకొని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా మృతుడి బంధువులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీనివ్వడంతో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరైన స్పందన రాకపోవడంతో మృతుడి బంధువులు రాత్రి మరోసారి దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని పోలీసులు హామీనివ్వడంతో శాంతించారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని సీఐ నాగభూషణరావు తెలిపారు.


ఘటనాస్థలంలో పంతు మృతదేహం

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

FOR SALE
■ నల్లగొండ పట్టణం వి.టి. థియేటర్ వెనుక ఉత్తరం ఫేస్ గల 150 చ॥గ॥ల ఇల్లు అమ్మబడును. మరియు జాగృతి & హిమగిరి కాలనీ (సాక్షి ఆఫీస్ ఎదురుగా) తూర్పు ఫేస్ గల 200 చ॥గ॥ల 2 ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ 9490671122, 7989847080 [Y-798271]

VILLA FOR SALE
■ Ready to Occupy Duplex Luxury 3BHK 2340sft Villas In the Best Gated Community at Miryalaguda, Next to New D-Mart Club House, Swimming Pool Fully Operational. Must See! Call : 9502277099. [H-788598]

COMMERCIAL SALE
■ Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

Services

BUSINESS OFFER
■ రాజకీయ రంగంలో అవకాశం, ఎదగాలనే తపనగల స్త్రీ/పు, జనసేవకులు కావలెను. ఆర్థిక సహకారం లభించును. ఫోన్ : 7386275652, 7386425653 [H-793401]
■ ప్రతి వ్యాపార వేత్త ఎదుగుదలకు గొప్ప అవకాశం మీ వ్యాపారాన్ని సులువుగా గుర్తింపు (బ్రాండ్) పొందడానికి అనుకూలమైన అతిపెద్ద ప్లాట్ ఫారమ్ కొరకు సంప్ర: 8143514395. [H-788375]

TRAINING
■ గ్రామీణ మహిళలకు శుభవార్త. ఉచిత కుట్టు శిక్షణ 3 నెలల కాలవ్యవధి సంప్రదించండి. నార్కట్‌పల్లి. ఫోన్ : 7989377042 [H-788321]

Wanted
■ మా ఆఫీసు నందు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంతో పార్ట్ టైమ్ / ఫుల్ టైం ద్వారా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751694]
■ సూర్యపేటలో ప్రముఖ వాల్యూర్స్ ఆఫీస్ నందు పనిచేయుటకు డిప్లొమా సివిల్ ఇంజనీర్స్ కావలెను. ఇతర బ్యాంక్ వాల్యూర్స్ ఆఫీస్‌లో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును ఫోన్: 94912 98349 [V-797320]
■ గాయత్రి గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 62812 08600, 6281208656 [B-1068117]
■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను.ఉచిత వసతి+భోజనం. జీతం :18K. Ph: 9848571888/ 9640400073 [H-189335]
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TS.No.-1) హైదరాబాద్‌లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు M/F కావలెను. భోజనం+వసతి+జీతం 15-16వేలు. ఫోన్: 9618221160, 9133271122 [H-788535]
■ Wanted Reporters in Each Mandal. All The Districts, Immediate Appointment @ swathi news. Ph : 7997733373 [H-788318]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.